

ఎన్‌టిఎ రాష్ట్ర అధ్యక్షులుగా శ్రీనివాసరాజు

ప్రజాశక్తి-రాయచోటి

నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా రాయచోటికి చెందిన కొండూరు శ్రీనివాసరాజు ఎంపికయ్యారు. ఆదివారం ఉదయం గుంటూరులోని ఎన్‌జిఒ హోంలో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ తృతీయ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ముందుగా రాష్ట్ర అధ్యక్షులుగా పనిచేస్తున్న నడిపినేని వెంకట్రావు తన పదవికి రాజీనామా చేయడంతో ఈ ఎంపిక అనివార్యమైంది. ఈ సందర్భంగా కొండూరు శ్రీనివాసరాజు మాట్లాడుతూ అనునిత్యం ఉపాధ్యాయులకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వంతో ప్రాతినిధ్యం చేసి ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అశోక్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ ఎఎస్ రామకృష్ణ, ఎన్‌టిఎ క్రమశిక్షణ సంఘం చైర్మన్ చెరుకూరి సుభాష్‌చంద్రబోస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హైమారావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బివినాగేశ్వరరావు, అన్ని జిల్లాల అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భగత్ సింగ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి



భగత్ సింగ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సిపిఎం, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

దేశ పోరాట యోధుడు భగత్ సింగ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలో స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో స్వాతంత్ర సమర యోధుడు భగత్ సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పి.శ్రీనివాసులు, జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి హరినాథ్‌శర్మ, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు నరసింహ మాట్లాడుతూ నేటి విద్యార్థి, యువతకు భగత్ సింగ్ పోరాట జీవితం స్ఫూర్తిదాయకమని అన్నారు. అతి చిన్న వయసులో పోరాటాల వైపు ఆకర్షితులై దేశంలో సంపూర్ణ స్వాతంత్రం కోసం బ్రిటిష్ సామ్రాజ్య వాదుల గుండెల్లో గునపంగా మారి తన ప్రాణాలను సైతం తృణ ప్రాయంగా అర్పించిన విప్లవ యువకిశోరం భగత్‌సింగ్, రాజ్‌గురుసుఖ్‌దేవ్ అని పేర్కొన్నారు. దేశంలోని ప్రతి పౌరుడు స్వేచ్ఛగా బ్రతకాలని లౌకికవాదం పరిరక్షించాలని దేశానికి సంపూర్ణమైన స్వాతంత్రం తీసుకురావాలని పోరాటాలు చేసిన భగత్ సింగ్ లాంటి పోరాట యోధుల ఆశయాలను నేటి పాలకులు అనుసరించాల్సింది పోయి నీరు గారుస్తున్నారన్నారు. దేశంలో ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి ప్రజాస్వామ్య స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, రాజ్యాంగ అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. దేశవ్యాప్తంగా లౌకికవాదాన్ని దెబ్బతీసే విధంగా అనేక కార్యకలాపాలు చేయడం ద్వారా స్వాతంత్ర సమరయోధుల పోరాటాన్ని, ఫలితాలను నేటి బిజెపి పాలకులు సర్వనాశనం చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ కోసం భగత్ సింగ్ స్ఫూర్తితో పోరాటాలు చేసి సాధించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆఫ్రిద్, జిల్లా కమిటీ సభ్యుడు జయబాబు, అఖిఫ్, హనుమంత నాయక్, ప్రసాద్, సిఐటియు నాయకులు నాగరాజు ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, సిఐటియు కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

మదనపల్లె : నిమ్మనపల్లి రోడ్డు లోని శ్రీ క్రిష్ణ చైతన్య కళాశాలలో వివిధ కళాశాలల విద్యార్థులతో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల 94వ వర్ధంతి సభను ఆంధ్రప్రదేశ్ స్టూడెంట్స్ జెఎసి జిల్లా అధ్యక్షులు గంగరాజు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బహుజన సేన రాష్ట్ర అధ్యక్షులు శ్రీ చందు, సీనియర్ న్యాయవాది కె. సోముశేఖర్, ఆంధ్రప్రదేశ్ స్టూడెంట్స్ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి వి. ఉత్తన్న, పోర్డ్ సంస్థ నరసింహులు, వసతి గృహ సంక్షేమ అధికారి రామ్ ప్రసాద్, స్వేచ్ఛసంస్థ లక్ష్మి పాల్గొన్నారు. యువత భగత్‌సింగ్ పోరాట పటిమను ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో బహుజన సేన జిల్లా నాయకులు గిన్నెల మనోహర్ రెడ్డి, లారా అన్న, వెంకీ, విద్యార్థులు పాల్గొన్నారు. **పుల్లంపేట :** మండల పరిధిలోని తలవాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు రమణ ఆధ్వర్యంలో భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ భారతమాత ముద్దుబిడ్డ భగత్ సింగ్ చిరున వ్వుతో ఉరికొయ్యను ముద్దాడిన స్వాతంత్ర వీరడని కొనియాడారు. విద్యార్థులు భగత్ సింగ్ ను ఆదర్శంగా తీసుకొని ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు.



పుల్లంపేట : నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయుడు, విద్యార్థులు

రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

జిల్లా ఉద్యానవన శాఖ అధికారి పి.రవిచంద్రబాబు



ముఖాముఖి..

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో ప్రజలకు, రైతులకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు జిల్లా ఉద్యానవన శాఖ అధికారి పి. రవిచంద్రబాబు పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో ఉద్యానవన పంటలు రైతులు ఎంత సాగు చేశారో, అధిక దిగుబడి రావాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖిలో ఆయన వివరించారు.

జిల్లాలో ఉద్యానవన శాఖ కార్యాలయాలు వివరాలు తెలపండి?

అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో జిల్లా ఉద్యానవన శాఖ కార్యాలయం ఉంది. జిల్లా వ్యాప్తంగా 9 ఉద్యానవన శాఖ కార్యాలయాలున్నాయి. రాయచోటి, లక్కిరెడ్డిపల్లె, టి. సుండుపల్లె, రాజంపేట, రైల్వేకోడూరు, పీలేరు, మదనపల్లి, తంబళ్లపల్లె, మొలకలచెరువు ప్రాంతాలలో ఉద్యానవన శాఖ కార్యాలయాలున్నాయి.

జిల్లాలో ఉద్యానవనం పంట సాగు విస్తీర్ణం ఎంత?

జిల్లా వ్యాప్తంగా ఉద్యానవనం 2 లక్షల 25 వేలు ఎకరాలలో రైతులు పంటలను సాగు చేశారు. మామిడి 18,858.4, బొప్పాయి 2,447.6 ఉసిరికాయ 26.7, అరటి 4,557, నిమ్మ 543.6, ఆరంజి 94.4, సీతాఫలం 88.8, జామ 482.4, దానిమ్మ 282.4, సపోటా 171.6, కర్బుజా 188.8, పుచ్చకాయ 485.6, మిగిలిన పండ్లు 746.8 మొత్తం పండ్లు 28,978, బీన్స్ 18.8, కాకరకాయ 15.6, వంకాయ 193.2, టమోట 5,346.4, ఇతర వెజిటేబుల్స్ 767.2, మొత్తం వెజిటేబుల్ 6981.6, ఇతర సుగంధ ద్రవ్యాలు 1100.4, మొత్తం పువ్వులు 252.4, మొత్తం గ్రేడ్ 38,200 ఎకరాలలో జిల్లా వ్యాప్తంగా ఉద్యానవన పంటలు సాగు చేశారు.

మామిడిలో సరైన దిగుబడి రావాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

వాతావరణం మార్పు వల్ల పూత ఆలస్యంగా రావడం, అధిక ఉష్ణోగ్రత, అకాల వర్షాలు వల్ల సరైన మామిడి పంట సరైన దిగుబడి రాలేదు. రైతులు సరైన యాజమాన్య పద్ధతిని అవలంభించాలి. మామిడి పంట కోత అనంతరం జూన్, జులై నెలలో పది రోజులు తరువాత కొమ్మ కత్తిరింపులు, రసాయన ఎరువులు వాడాలి. చీడపీడకు నివారణకు చిన్నపాటి మందులు బర్డ్ మిక్సర్, వాడకం కొమ్మలు తడిసే విధంగా మందులు పిచుకారి చేయాలి. రసాయనిక సేంద్రియ ఎరువులు వాడి నీటిని డ్రిప్స్ ద్వారా వాడడం వల్ల ఒక్కసారిగా ఇగురు వచ్చి కొమ్మలు పూత ఉత్పత్తి అవుతాయి. ప్రస్తుతం మామిడి కాయలను కాపాడడం కోసం చెట్లకు నీటిని క్రమక్రమంగా పెంచుకుంటూ పోవాలి. రైతులందరూ ఫ్రూట్ కవర్‌ను వాడవలెను.

జిల్లాలో నర్సరీలు ఎన్ని ఉన్నాయి?

జిల్లాలో 436 నర్సరీలున్నాయి. మదనపల్లి, రాజంపేట, రైల్వే కోడూరు, రాయచోటి, ప్రాంతంలో దేవపట్ల, పీలేరు ప్రాంతాలలో నర్సరీలు ఎక్కువగా ఉన్నాయి. ఈ నర్సరీలలో మామిడి, టమోటా, బొప్పాయి, అరటి, మిరప ఇతర మొక్కలు అందుబాటులో ఉన్నాయి.

ఇతర రాష్ట్రాలకు ఏయే పంటలు ఎగుమతి చేస్తున్నారు?

జిల్లా నుంచి మామిడి, అరటి, బొప్పాయి వంటి పంటలను ఎక్కువగా తమిళనాడు, చెన్నై, ముంబై, బెంగళూరు ప్రాంతాలకు ఎగుమతులు అవుతున్నాయి. రైతులు నాణ్యమైన పంటలను దిగుమతి చేస్తే అధిక లాభాలు పొందవచ్చును.

సిబ్బంది కొరత కొరత ఏమైనా ఉందా?

జిల్లాలో ఉద్యానవన శాఖలో సిబ్బంది కొరత ఉన్నప్పటికీ ఉన్న సిబ్బందితో విధులు నిర్వహిస్తున్నాం.

అధిక దిగుబడి సాధించాలంటే రైతులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

రైతులు అద్దెకు దిగుబడి కోసం శాస్త్రీయ పద్ధతి ద్వారా పంటలను సాగు చేసుకోవాలి. మంచి విత్తనాలను సేకరించుకొని పంటను ప్రతి ఏడాది మార్పిడి చేసుకోవాలి. కలుపు మొక్కలను తీసివేయాలి. ఉద్యానవన శాఖ అధికారులు సూచించిన మందులు వాడకం ద్వారా తెగుళ్లను నియంత్రించి అధిక దిగుబడి సాధించవచ్చును.

ఇళ్ల నిర్మాణాల తొలగింపులో ఉద్రిక్తత

-గడువు విధించిన తహశీల్దార్ భీమేశ్వరరావు

ప్రజాశక్తి-పీలేరు

స్థానిక పట్టణంలోని ఎల్‌బిఎస్ రోడ్డులోని రైల్వే గేట్ సమీపంలో ఆర్‌ఒబి నిర్మాణం చేపట్టారు. గేటు సమీపంలో ఇరువైపులా ఉన్న పక్కా నిర్మాణాలను తొలగించడానికి అధికారులు ఆదివారం ప్రయత్నించడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. రోడ్డుకు ఇరువైపులా నిర్మాణాలను తొలగించి, రైల్వే గేట్ మార్చాలని ప్రతిపాదించారు. నిర్మాణాల తొలగింపుకు మూడు నెలల క్రితమే జాతీయ రహదారుల శాఖ, రెవెన్యూ శాఖ గేటుకు ఇరువైపులా ఉన్న నిర్మాణాలను కొలతలు వేసి ఏ మేరకు నిర్మాణాలు తొలగించాల్సి వస్తుందన్న విషయాన్ని ఆయా ఇళ్ల యజమానులకు తెలిపారు. గటుకు ఓ వైపున ఉన్న కొందరి నిర్మాణాలకు సంబంధించి నష్ట పరిహారం చెల్లించేందుకు, సర్వేయర్ కొలతలు తీసి ఆ నివేదిక ఆధారంగా పరిహారం దస్త్రాలను సిద్ధం చేసి, రాయచోటి ఆర్‌డిఒ కార్యాలయానికి పంపారు. మరోవైపున ఉన్న నిర్మాణాలను మాత్రం పరిహారం కోసం ప్రతిపాదనలు పంపనందున వాటి యజమానులు తొలగింపు విషయంలో పద్ధతిగా ఉండిపోయారు. స్థానికంగా జాతీయ రహదారి పనులు చేయిస్తున్న సిబ్బంది మాత్రం నిర్మాణాలు తొలగించాల్సి వస్తుందని వారికి అప్పుడప్పుడు హెచ్చరిస్తూనే వచ్చారు. కానీ ఏ మాత్రం తొలగించాలన్న విషయాన్ని స్పష్టం చేయకుండానే తొలగించాలంటే ఎలా అని స్థానికులు వారిని ప్రశ్నించారు. ఆదివారం తహశీల్దార్, ఎస్‌ఐ బాలకృష్ణ, తమ సిబ్బందితో ఒక్కసారిగా వచ్చి నిర్మాణాలను తొలగించడానికి యంత్రాలు ఉపయోగించడంతో అక్కడ కొంతమేర ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ముందుగా నోటీసులు ఇవ్వకుండా తొలగించాలంటే ఇబ్బంది అవుతుందని బాధితులందరూ కోరడంతో తహశీల్దార్ నిర్మాణాల తొలగింపుకు మరో నాలుగు రోజులు గడువు ఇవ్వడంతో పరిస్థితి కొంత సద్దుమణిగింది. బాధితులు మాట్లాడుతూ తొలగింపు గడువుతో పాటు పరిహారం కూడా చెల్లించాలని డిమాండ్ చేశారు.



ఇళ్ల యజమానులతో మాట్లాడుతున్న తహశీల్దార్

ఆర్‌టిసి ప్రయివేటీకరణ ఆపాలి : సిఐటియు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆర్‌టిసి ప్రత్యక్ష పరోక్ష ప్రయివేటీకరణ ఆపాలని సిఐటియు జిల్లా కోశాధికారి హరిశర్మ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు నరసింహులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయమై సిఐటియు అనుబంధ ఎస్‌డబ్ల్యుఎఫ్ ప్రచురించిన బుక్‌లెట్, కరపత్రాలను ఆదివారం స్థానిక ఆర్‌టిసి ప్రాంగణంలో విడుదల చేసి ఆర్‌టిసి కార్మికులకు పంపిణీ చేశారు. విద్యుత్ బస్సుల కొనుగోలు పేరుతో ప్రయివేటు ఓనర్లకు పలు రాయితీలు ఇవ్వడాన్ని ఖండించారు. దీనివల్ల ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని, ఈ బస్సులోని హెచ్చు చార్జీలవల్ల సామాన్యులపై భారం పడుతుందని అన్నారు. పల్లెవెలుగు బస్సులు పెంచితే ఉపయోగ మకరమని అన్నారు. ఎలక్ట్రిక్ బస్సుల వల్ల కాలుష్యం తగ్గుతుందనడంలో వాస్తవం లేదన్నారు. బుక్ లెట్స్ చాలా బాగున్నాయని, వాస్తవ పరిస్థితులు, సమస్యలపై ప్రచురించారని పలువురు కార్మికులు ఎస్‌డబ్ల్యుఎఫ్‌ను అభినందించారు. ఢిల్లీలో జరుగనున్న ఆర్‌టిసి ఛలో పార్లమెంటు నిరసన జయప్రదం కావాలని ఆకాంక్షించారు. ఆర్‌టిసి కార్మికులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం వారిగోడును పెడచెవిన పెట్టడంతో దేశవ్యాప్తంగా తమ సమస్యలను పార్లమెంటుకు తెలుపుకోవాలని 24న ఛలోఢిల్లీ నిరసన ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కళ్లు తెరవాలన్నారు.లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఆఫ్రీది, జయబాబు, పవన్, కార్మికులు పాల్గొన్నారు.



ఎస్‌డబ్ల్యుఎఫ్ బుక్‌లెట్స్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్‌టిసి కార్మికులు



పశువుల షెడ్డును ప్రారంభిస్తున్న లక్ష్మీప్రసాద్‌రెడ్డి

పాడి రైతుల సంక్షేమమే ధ్యేయం

ప్రజాశక్తి-రాయచోటి

పాడిరైతుల సంక్షేమానికి ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని నియోజకవర్గం టిడిపి నాయకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని యండపల్లిలో నియోజకవర్గం టిడిపి నాయకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్ రెడ్డి పశువుల షెడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని చెప్పారు. పాడి రైతులు ఈ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థిక అభివృద్ధి చెందాలన్నారు. పాడి పశువులు ఎండ, వాన గాలికి గురి కాకుండా ఆరోగ్యంగా జీవించేందుకు ప్రభుత్వం పశువుల షెడ్లను మంజూరు చేస్తామని తెలిపారు. పాడి రైతులు పశువుల షెడ్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. యండపల్లి గ్రామంలో నూతన బోరుకు మోటారు బిగించి గ్రామానికి నీటి సరఫరా చేసి నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపామని తెలిపారు. అనంతరం యండపల్లి గ్రామం బుడ్డ వాండ్ల పల్లికు చెందిన టిడిపి నాయకులు రెడ్డప్ప ఏర్పాటు చేసిన విందుకు హాజరయ్యారు. కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం షాక్

ప్రజాశక్తి- రాయచోటి : కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు మరోసారి షాక్ ఇవ్వనుందని వైసిపి బిసి సెల్ అధికార ప్రతినిధి సిబ్యాల విజయభాస్కర్ పేర్కొన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం గత సంవత్సరం మార్చి నుంచి ఇప్పటి వరకు సిపిఎస్ ఉద్యోగుల బకాయిలను పెండింగ్‌లో ఉందన్నారు. ఇప్పుడు ఆగమేఘాలపై వారి బకాయిలు చెల్లించకపోతే ప్రభుత్వానికి పరపతి పోతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు బకాయిలు ఇస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం పరోక్షంగా వారికి మొండి చెయ్యి చూపనుందని తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 20 లక్షలు ఉద్యోగాలు కల్పిస్తామని, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి రూ. 3 వేలు ఇస్తామని, ఎన్నో అబద్ధాలు చెప్పి ధికారంలోకి వచ్చిన ప్రభుత్వం హామీలను పూర్తిగా విస్మరించిందని పేర్కొన్నారు. సిపిఎస్ మీద కాలయాపన చేస్తూ కొత్త నాటకానికి తెర లేపారని విమర్శించారు. సమావేశంలో వైసిపి నాయకులు రవీంద్ర యాదవ్, సంజీవయ్య, జిల్లా బిసి సెల్ అధ్యక్షులు సాంబశివ, తంబళ్లపల్లె బిసిల అధ్యక్షులు మల్లికార్జున పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విజయభాస్కర్

'చైతన్య' సేవలు స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థను డాక్టర్ చైతన్య, డాక్టర్ ఐశ్వర్య ఆదివారం సందర్శించి పిల్లలతో సమయాన్ని గడిపారు. సంస్థలోని వృద్ధులు, పిల్లలతో గడిపి పోషక విలువలతో కూడిన భోజనాన్ని అందించారు. ఐశ్వర్యకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు సమాజానికి ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. పట్టణంలోని ప్రజలు వారి ఇంటిలోని శుభకార్యాలు, పుట్టినరోజు వేడుకలు చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థలోని చిన్నారులతో జరుపుకుంటూ పిల్లల్ని ఆశీర్వదించాలని కోరారు. అనంతరం సంస్థ జనరల్ సెక్రెటరీ కవితారాణి జ్ఞాపికతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

బ్యాడ్మింటన్ ఛాంపియన్‌గా హోత్రిశ్రీ

ప్రజాశక్తి-పీలేరు

ఇంటర్ కాలేజియేట్ గేమ్స్ మీట్-2025లో టి.హోత్రిశ్రీ బ్యాట్మెంటన్ సింగిల్స్, డబుల్స్ మహిళా విభాగంలో అద్భుతమైన ఆటను ప్రదర్శించి ఛాంపియన్‌గా నిలిచింది. పీలేరుకు చెందిన ఈ యువతి తిరుపతి కెఎంఎం ఇంజనీరింగ్ కాలేజీలో ఇసిఇ విభాగం ద్వితీయ సంవత్సరం బీటెక్ చదువుతోంది. అనంతపురం జెఎన్‌టియుఎ ఆధ్వర్యంలో కలికిరి జెఎన్‌టియుఎ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ఈ పోటీల్లో ఆమె సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో ప్రత్యర్థులపై అలవోకగా విజయం సాధించింది. సింగిల్స్ ఫైనల్లో జెఎన్‌టియుఎ అనంతపూర్ విద్యార్థిని గ్రేసీని ఎదుర్కొన్న హోత్రిశ్రీ 30-9 పాయింట్ల తేడాతో గెలిచి టైటిల్‌ను దక్కించుకుంది. డబుల్స్ విభాగంలో తన జోడి గురుపూజితతో కలిసి ప్రొద్దుటూరు గౌతమీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ విద్యార్థినులు మోక్షిత, వైష్ణవి జంటను 30-16 పాయింట్ల తేడాతో ఓడించి డబుల్స్ ఛాంపియన్‌షిప్ ను సొంతం చేసుకుంది. జెఎన్‌టియుఎ ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు హోత్రిశ్రీ ట్రోఫీని అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయస్థాయి బ్యాట్మెంటన్ క్రీడాకారుడైన తన తండ్రి టి.ప్రభాకర్‌రెడ్డి తనకు కేవలం కోచ్ మాత్రమే కాదని నిజమైన ఫిలాసఫర్ కూడా అని అన్నారు. తన తండ్రి మార్గదర్శకత్వం వల్లే తాను ఈ స్థాయికి చేరుకున్నానని చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో రాణించడమే తన తదుపరి కర్తవ్యం అని అన్నారు. ఈ సందర్భంగా ఆమెను కుటుంబసభ్యులు, స్నేహితులు, సహచర విద్యార్థులు అభినందనలు తెలిపారు.



ట్రోఫీ అందుకుంటున్న హోత్రిశ్రీ

గాలివాన బీభత్సం

నేలకొరిగిన అరటి
6,137.5 ఎకరాల్లో దెబ్బతిన్న పంట
పరిశీలించిన మాజీ ఎమ్మెల్సీ బి.టెక్.రవి
బాధితులను ఆదుకుంటామని హామీ
ఇద్దరు రైతులు ఆత్మహత్యాయత్నం
నేడు దెబ్బతిన్న పంటను పరిశీలించనున్న వై.ఎస్.జగన్



ప్రజాశక్తి- లింగాల/ పులివెందుల టౌన్

లింగాల మండల పరిధిలో శనివారం రాత్రి సంభవించిన గాలివానకు అరటి పంట ధ్వంసమైంది. సుమారు 6,137.5 ఎకరాల్లో పంట దెబ్బతింది. వివరాలు.. మరో నెల రోజుల్లో పంట చేతికి అందే సమయంలో అకాల వర్షానికి మండలంలోని తాతిరెడ్డిపల్లెలో అరటి పంట దెబ్బతింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్సీ, టిడిపి పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి బి.టెక్ రవి ఆదివారం దెబ్బతిన్న పరిశీలించారు. నష్టపోయిన రైతులను ఆదుకునేలా సింఎ చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామని ఆయన చెప్పారు. లక్షలు పెట్టుబడి పెట్టి అరటిని సాగు చేశామని, కన్నబిడ్డలా చూసుకున్న పంట ఇలా ప్రకృతి వైపరీత్యానికి నేలకొరిగిందని బాధిత రైతులు వాపోయారు. నేలకొరిగిన 6,137.5 ఎకరాల పంట వివరాలను, నష్టాలను అంచనా వేసి నివేదిక తయారు చేయాలని ఉద్యానశాఖ అధికారి రాఘవేంద్రరెడ్డికి సూచించారు. నివేదిక ఆధారంగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి బాధిత రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. మండలంలోని కోమన్నూతల, పార్నపల్లె, వెలిదండ్ల, మూరారిచింతల ,లింగాల, లోపట్నూతల, రామట్లపల్లె, చెర్లోపల్లి, చిన్నకూడల, పెద్దకూడల గ్రామాల్లో 825 మంది రైతులకు చెందిన అరటి పంట దెబ్బతిందని అధికారులు గుర్తించారు.గ్రామాల్లోని పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడి పంట నష్టంపై ఆరా తీస్తారు.

దెబ్బతిన్న అరటి పంటను పరిశీలించనున్న జగన్

అకాల వర్షాలకు నేలకొరిగిన అరటి పంటలను సోమవారం వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి పరిశీలించనున్నారు. శనివారం రాత్రి కురిసిన వర్షానికి లింగాల మండలంలో 6,137.5 ఎకరాల మేర అరటి పంట నష్టం వాటిల్లింది. మండలంలోని చిన్నకూడాల కోమనూతల, తాతిరెడ్డిపల్లి గ్రామాలలో అధిక శాతం పంట నష్టం వాటిల్లింది.

అరటి పంట దెబ్బతినడంతో
ఇద్దరు రైతులు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

లింగాల మండలం పార్నపల్లె సమీపంలో ఉన్న అరటి పంట శనివారం వీచిన గాలివానకు నేలకొరిగింది. నష్టపోయిన ఇద్దరు రైతులు మనస్థాపం చెంది ఆత్మహత్యకు యత్నించారు. వివరాలు.. అనంతపురం జిల్లా ఎల్లనూరు మండలం నీర్జంపల్లె గ్రామానికి చెందిన ఇద్దరు రైతులు లక్ష్మీనారాయణ, చిన్న వెంకటప్ప కడప జిల్లా లింగాల మండలం పార్నపల్లె సమీపంలో పది ఎకరాల్లో అరటి పంటను సాగు చేశారు. శనివారం రాత్రి సంభవించిన గాలివానకు పంట దెబ్బతింది. విషయం తెలుసుకున్న బాధితులు ధ్వంసమైన పంటను పరిశీలించి బోరున విలపించారు. సుమారు రూ. 30 లక్షలు నష్టం రావడంతో మనస్థాపానికి గురై పంట పొలంలోనే పురుగుల మందు మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. విషయం తెలుసుకున్న బంధువులు హుటాహుటినా పులివెందుల ఏరియా ఆసుపత్రి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.



చికిత్స పొందుతున్న బాధిత రైతులు



హెల్పింగ్ మైండ్స్ లోగోను ఆవిష్కరిస్తున్న అమీన్‌పీర్ దర్గా పీఠాధిపతి

హెల్పింగ్ మైండ్స్ లోగో ఆవిష్కరణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలో సేవా కార్యక్రమాలు చేపడుతున్న హెల్పింగ్ మైండ్స్ 12వ వార్షికోత్సవ లోగోను ఆదివారం కలిచెర్ల మౌలాకా పహాడ్ వద్ద కడప అమీన్ పీర్ దర్గా పీఠాధిపతి, మౌలాకా పహాడ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు హాజరత్ సయ్యద్ షా ఖ్వాజా ఆరిపుల్ల హుస్సేని చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఆరిపుల్లా సాహెబ్‌ను హెల్పింగ్ మైండ్స్ బృందం దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబక్కర్ సిద్దిక్ మాట్లాడుతూ తన గురువు చేతుల మీదుగా 12వ వార్షికోత్సవ లోగో ను ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. నిస్వార్థమైన సేవా కార్యక్రమాలు రక్తదానం, ఫుడ్ బ్యాంక్, సానిటరీ ప్యాడ్ బ్యాంక్, కేన్సర్ రోగులకు ఉచితంగా విగ్గులు, మూగజీవాలకు నీటి, ఆహారం సదుపాయం, ఉచిత బాడీ ఫ్రీజ్ సేవలు, అనాథ మృతదేహాల అంత్యక్రియలు ఇలా పలు కార్యక్రమాలను 12 ఏళ్లుగా దిగ్విజయంగా ముందుకు సాగడం గర్వంగా ఉందన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలతో ముందుకెళతామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు సునీల్, పవన్, కిరణ్, బషీర్, చైతు, సాంబ పాల్గొన్నారు.

బెట్టింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి-పుల్లంపేట



మాట్లాడుతున్న ఎస్ఐ మోహన్‌కుమార్‌గౌడ్

యువత బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని ఎస్ఐ మోహనకుమార్‌గౌడ్ పేర్కొన్నారు. ఐపిఎల్ క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభమయ్యాయని వీటిని అదునుగా తీసుకొని కొందరు క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడే అవకాశ ముందని అన్నారు. మండలంలో నిఘాను పటిష్టం చేశామని ఎవరైన బెట్టిం గ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. టీ బంకులు, హోటళ్లలపై ప్రత్యేక నిఘా ఉంచామని బెట్టింగ్‌కు పాల్పడితే దొరికి పోతారని అన్నారు. తల్లిదం డ్రులు తమ పిల్లలను గమనిస్తూ ఉండాలని బెట్టింగులకు పాల్పడుతు న్నట్ల యితే వారికి నచ్చజెప్పి ఆ ఊబిలో నుండి బయటకు తీసుకురావాలని సూచిం చారు. బెట్టింగ్ నిర్వాహకులను గుర్తించి వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. మండలంలో ఎక్కడైనా క్రికెట్ బెట్టిం గులు జరుగుతున్నట్లు తెలిస్తే డయల్ 9121100574 కాల్ చేసి సమాచారం అందించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ తెలిపారు.

కోటపాటి యశోదకు సేవారత్న అవార్డు

ప్రజాశక్తి - వేంపల్లె

భవిత కేంద్రంలో విభిన్నప్రతిభావంతులకు చేస్తున్న సేవలను గుర్తిం చి కెసి పుల్లయ్య ఫౌండేషన్ వారు వేంపల్లెకు చెందిన కోటపాటి యశోదకు సేవా రత్న అవార్డు అందజేశారు. ఆమె విభిన్నప్రతిభావంతులకు 20ఏళ్లుగా సేవలు చేసిన సందర్భంగా ఆదివారం ప్రొద్దుటూరులో కెసి పుల్లయ్య ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో సేవా రత్న అవార్డు ప్రదానం చేశారు. ఆ మేరకు ఏర్పాటు చేసిన కార్యక్ర మంలో ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఐఇఆర్టీ కోటపాటి యశోదకు సేవా రత్న అవార్డు అందజేశారు. సన్మానించి, చెక్కును అందజేశారు. తమిళ నాడు చెందిన అర్మెల్ వల్లికి కళారత్న, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వాసిరెడ్డి వంశీకృష్ణకు హరిత రత్న, తెలంగాణకు చెందిన ప్రభాకర్‌రెడ్డికి విద్యారత్న, రాయలసీమకు చెందిన కోటపాటి యశోదకు సేవారత్న అవార్డులు ఇచ్చారు. సేవా రంగంలో మరింత రాణించాలని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆకాంక్షించారు. వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారిని గుర్తించి కెసి పుల్లయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో సత్కరించడం అభినందనీయమని తెలిపారు. కెసి పుల్లయ్య ఫౌండేషన్ కార్యదర్శి అనిల్‌కుమార్ మాట్లాడుతూ కొన్నేళ్లుగా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు సేవా రత్న అవార్డులు ప్రదానం చేసి గౌరవించామన్నారు. యశోద సేవలు ఆదర్శనీయమని తెలిపారు. తనకు సేవా రత్న అవార్డు రావడం సంతోషంగా ఉందని యశోద పేర్కొన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడు, టిటిడి పాలకమండలి మాజీ సభ్యులు టంగుటూరి మారుతి ప్రసాద్, తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత, సిఇఒ చల్లా సుధా, కెసి పుల్లయ్య ఫౌండేషన్ ప్రతినిధులు కృష్ణవేణమ్మ పాల్గొన్నారు. ఐఇఆర్టీ యశోదకు సేవా రత్న అవార్డు రావడం పట్ల జిల్లా సమన్వయకర్త రమణమూర్తి, ఎంఇఒ జాఫర్ సాదిక్, స్టాలిన్ ఐజాక్, భవిత కేంద్ర సిబ్బంది, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యుత్ కనెక్షన్లు లేక ఇబ్బందులు

ప్రజాశక్తి - చక్రాయపేట

వ్యవసాయ మోటర్లకు విద్యుత్ కనెక్షన్‌లేక ఇబ్బందులు పడుతున్నామని మండలంలోని గొట్లమిట్ట గ్రామానికి చెందిన కొందరు రైతులు ఆదివారం టిడిపి మండల ఇన్‌ఛార్జి మహేశ్వరరెడ్డి దృష్టికి తెచ్చారు. చాలా కాలంగా భూ సమస్యలు పరిష్కారం కాక అధికారులు చుట్టూ తిరుగుతున్నామన్నారు. మమ్మల్ని పట్టించుకోలేదని రైతులు వాపోయారు. భూ సమస్య ఉండడంతో కరెంట్ కనెక్షన్ కుడా ఇవ్వలేదని తెలిపారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఇందుకు మహేశ్వరరెడ్డి సానుకూలంగా స్పందించారు.

కెజిబివిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - ఖాజీపేట స్థానిక సుంకేసుల రోడ్డులో ఉన్న కసూర్బా పాఠశాలలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంఇఒ నాగ స్వర్ణలత ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు బాలి కలందరూ ఏప్రిల్ 12వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ అవకా శాన్ని గ్రామీణ ప్రాంత విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రాయితీపై వ్యవసాయ పరికరాలు

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రభుత్వం రైతుల కోసం యాంత్రీకరణ పథకం ద్వారా 50శాతం రాయితీతో వ్యవసాయ పరికరాలను మంజూరు చేస్తుందని ఎఒ నాగార్చన తెలిపారు. ఆ మేరకు ఆదివారం ఆమె మాట్లాడుతూ అర్హతగల రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇ-కర్షక్ యాప్ ద్వారా నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లోని వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని ఎఒ సూచించారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - కడప

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో డిడియుజికెవై పథకం ద్వారా సీడప్ సౌజన్యంతో నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ సంస్థ ద్వారా జిల్లాలోని గ్రామీణ నిరుద్యోగ యువతకు 4 నెలల కాలవ్యవధిలో ఉచిత నైపుణ్య శిక్షణ అందిస్తున్నట్టు ఆ సంస్థ రీజినల్ కో-ఆర్డినేటర్ ఎన్. సుబ్బరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణలో కంప్యూటర్ హార్డ్‌వేర్‌కు పదవ తరగతి లేదా ఐటిఐ ఉత్తీర్ణత, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్‌కు ఇంటర్ లేదా డిగ్రీ, సైన్స్ బ్యాక్‌గ్రౌండ్ ఉత్తీర్ణత ఉండాలన్నారు. జూనియర్ సాఫ్ట్‌వేర్ వెబ్ డెవలపర్‌కు ఇంటర్ ఉత్తీర్ణత, బ్యూటీ థెరపీ పదవ తరగతి ఉత్తీర్ణత కలిగిన వాళ్లు శిక్షణ కోర్సులకు అర్హులు అని తెలిపారు. అదనంగా బేసిక్ కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్ నేర్పుతారని తెలిపారు. శిక్షణ సమయంలో అభ్యర్థులకు ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తారన్నారు.

ఎస్‌సి వర్గీకరణ రద్దు చేయాలి



మాట్లాడుతున్న మాలమహానాడు ఉద్యోగసంఘం నాయకులు

ప్రజాశక్తి-కలికిరి

ఎస్‌సి వర్గీకరణను వెంటనే రద్దు చేయాలని మాలమహానాడు ఉద్యోగ సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రం కలికిరిలో ఆదివారం కలికిరి మండల అంబేద్కర్ యువజన సంఘం, ఎస్‌సి ఎంప్లాయిస్ సంఘం ఆధ్వర్యంలో ఎస్‌సి వర్గీకరణ పై చర్చ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లా డుతూ గ్రామ, మండల ఎస్‌సి జనాభా ప్రాతిపదికన సర్వే చేయకుండా 2011 సంవత్సరంలో జరిగిన సర్వేని ప్రాతిపదికగా తీసుకుని ఎస్‌సి వర్గీకరణ చేయడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. గ్రామాలలో కలిసిమెలిసి ఉన్న మాల మాదిగల సోదరులను వర్గీకరణ పేరుతో వారి మధ్య చిచ్చు పెట్టడం చాలా దారుణం అన్నారు. మాలలు మాదిగ సోదరుల అభివృద్ధిని ఏనాడు అడ్డుకోలేదని అన్నారు. విద్యుతో పాటు అనేక రంగాలలో మాలలు పోటీ తత్వాన్ని ఎదుర్కొంటున్నారని తెలిపారు.తూర్పుగోదావరి జిల్లాలో ఇంద్రానగర్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేయడం చాలా హేమమైన చర్య అని వారిని వెంటనే పట్టుకుని కఠినంగా శిక్షించాలని అన్నారు. తిరుపతిలో ఆదివారం జరగబోయే మాలలు సింహగర్జనను ఆపడం ప్రభుత్వానికి న్యాయం కాదని తెలిపారు. స్వాతంత్రం వచ్చి 71 సంవత్సరాలు గడుస్తున్న ఈ సమాజంలోఎస్‌సి మహిళలు, దళితులపై దౌర్జన్యాలు, భూములు దురాక్రమణ, వివక్షత నేటికీ జరుగుతూనే ఉన్నాయని ఇలాంటి చర్యలను ప్రభుత్వాలు అరికట్టడం లేదన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు జయరాం, రాజకుమార్, వెంకట రమణ, ఆశాదవారిపల్లె గోపి, జి.శ్రీనివాసులు, రవీంద్ర, మల్లయ్య, వేణుగోపాల్ పాల్గొన్నారు.

జెఎన్‌టియులో ముగిసిన గేమ్స్ మీట్

ప్రజాశక్తి-కలికిరి

మండల కేంద్రం కలికిరిలోని జెఎన్‌టియులో 12వ ఇంటర్ కాలేజియేట్ గేమ్స్ మీట్ - 2025 ను ఘనంగా ముగిశాయి. మూడు రోజుల పాటు ఉత్కంఠ భరితంగా సాగిన జెఎన్‌టియుఎలో 12వ ఇంటర్ కాలేజియేట్ గేమ్స్ మీట్-2025 ఆదివారంతో ముగిసింది. వివిధ ఇంజినీరింగ్ కళాశాలల నుంచి వచ్చిన క్రీడాకారులు ఆరు క్రీడల్లో తమ ప్రతిభను చాటారు. ముగింపు వేడుకలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో మొదటిసారిగా ఈ క్రీడా పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో ఇలాం టి క్రీడా పోటీలు నిర్వహించడానికి తమ కళాశాల సిద్ధంగా ఉందని తెలిపారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ఆడారని, అందరినీ అభినందిం చారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ త్యాగరాజన్, జేఎన్టీయూఏ అనంతపురం ఫిజికల్ డైరెక్టర్ జోజీ రెడ్డి, వివిధ విభాగాల హెచ్‌ఒడిలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ కళాశాల నుంచి పాల్గొన్న విద్యార్థులు విజేతలుగా నిలిచారు. టేబుల్ టెన్నిస్ (పురుషుల సింగిల్స్) విజేత - జెఎన్‌టియుఎ అనంతపురం, రన్నర్-ఎన్.బి.కె.ఆర్ నెల్లూరు, టేబుల్ టెన్నిస్ (పురుషుల డబుల్స్) విజేత జెఎన్‌టియుఎ అనంతపూర్, రన్నర్స్ ఎన్‌బికె ఆర్ నెల్లూరు, టేబుల్ టెన్నిస్ (మహిళల సింగిల్స్): విజేత - జెఎన్‌టియుఎ అనంతపురం, రన్నర్ -ఎన్‌బికెఆర్ నెల్లూరు. టేబుల్ టెన్నిస్ (మహిళల డబుల్స్): విజేత - జెఎన్‌టియుఎ అనంతపురం, రన్నర్-జెఎన్‌టియుఎ పులివెందుల, బ్యాడ్మింటన్ (మహిళల సింగిల్స్): విజేత - కెఎంఎం తిరుపతి, రన్నర్-జెఎన్‌టియుఎ అనంతపురం, బ్యాడ్మింటన్ (మహిళలడబుల్స్): విజేత-కెఎంఎం తిరుపతి, రన్నర్-గౌతమి ప్రొద్దుటూరు, బ్యాడ్మింటన్ (పురుషుల సింగిల్స్): విజేత- మిట్స్ మదనపల్లి, రన్నర్- ఎస్ఆర్ఇసి నంద్యాల. బ్యాడ్మింటన్ (పురుషుల డబుల్స్): విజేత - మీట్స్ మదనపల్లి, రన్నర్ - విశ్వోదయ కావలి. త్రోబాల్ (మహిళలు): విజేత- మిట్స్ మదనపల్లి, రన్నర్ -జెఎన్‌టియుఎ కలికిరి. హ్యాండ్ బాల్ (మహిళలు): విజేత - జెఎన్‌టియు పులివెందుల, రన్నర్ - ఎన్‌బికెఆర్ నెల్లూరు. వాలీబాల్ (మహిళలు): విజేత- ఎస్‌విసిఇ తిరుపతి, రన్నర్-జెఎన్‌టియుఎ అనంతపురం, ఖోఖో(పురుషులు): విజేత -జెఎన్‌టియుఎ కలికిరి, రన్నర్- కెఎస్ఆర్ఎం కడప.హ్యాండ్ బాల్ (పురుషులు): విజేత-సిద్ధార్థ పుత్తూరు, రన్నర్-జెఎన్‌టియుఎ కలికిరి, వాలీబాల్ (పురుషులు): విజేత- సిద్ధార్థ పుత్తూరు, రన్నర్-మిట్స్ మదనపల్లి. ఓవరాల్ ఛాంపియన్ షిప్ టైటిల్: జెఎన్‌టియుఎ అనంతపురం (50 పాయింట్లు) నిలిచారు. గెలుపొందిన విజేతలకు ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు బహుమతులు ప్రధానం చేశారు.



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ప్రిన్సిపల్ వేంకటేశ్వరరావు

అర్థరహిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్


టిడిపి తరపున పులివెందుల ఎమ్మెల్యేగా నీవు పోటీ చేసినప్పటి నుంచి తాము ఎన్నికలు వచ్చినప్పుడల్లా బూత్‌ల్లో తిరుగుతూ.. కౌంటింగ్ కేంద్రాలకు కూడా వెళ్లే వారమని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి సతీష్‌కుమార్‌రెడ్డిని ఉద్దేశించి పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. సతీష్ కుమార్‌రెడ్డి నీ చరిత్ర.. నీ రాజకీయం అన్నీ తెలుసునని అన్నారు. చంద్రబాబును, లోకేష్‌ను విమర్శించే నైతిక విలువలు సతీష్‌కు లేవన్నారు. ఒకప్పుడు వైఎస్ కుటుంబాన్ని విమర్శించి, ఈరోజు వారి భజన చేయడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. జగన్మోహన్‌రెడ్డి మెప్పు పొందడానికి ఇష్టానుసారంగా చంద్రబాబు గురించి మాట్లాడుతున్నావని అన్నారు. 1995 నుండి 2019 వరకు తెలుగుదేశం పార్టీలో ఎన్నో పదవులు అనుభవించావన్నారు. ఎమ్మెల్సీని చేసి డిప్యూటీ శాసనమండలి చైర్మన్‌గా చేస్తే, ఈరోజు ఇష్టానుసారంగా తెలుగుదేశం పార్టీపై మాట్లాడడం సిగ్గుగా లేదా అన్నారు. ఆనాడు నీవు నిలబడిన ప్రతి ఎన్నికల్లో నీపై నమ్మకం లేకనే ప్రజలు నిన్ను గెలిపించలేదన్నారు. వైసిపి అధికార ప్రతినిధిగా ఉండి సమస్యలపై ఏనాడైనా మాట్లాడావా అని ప్రశ్నించారు. ముఖ్యంగా మీ వేంపల్లి తాగునీటి సమస్యపైన స్పందించలేదన్నారు. ప్రజలపై చిత్తశుద్ధి ఉంటే మీ ఎంపీని అడిగి నిధులు ఇప్పించి తాగునీటి సమస్యకు పరిష్కారం చూపించాలన్నారు. నీ నీచ రాజకీయం ఆనాడు పార్టీలో మేము దగ్గరుండి చూశామన్నారు. ఆనాడు వేల్పుల దగ్గర జరిగిన సంఘటనలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్యాయంగా మమ్మల్ని ఇరికించారని గగ్గోలు పెట్టావే, మరి ఈనాడు జగన్ మోహన్ రెడ్డి నీకు దేవుడయ్యాడా అని ప్రశ్నించాడు. నిన్ను నమ్మి ఆనాడు మేము ఎన్నో సాధక బాధలు అనుభవించామన్నారు. మా ఆస్తులు కూడా పోగొట్టుకున్నామన్నారు. అన్యాయంగా మనపైన జగన్మోహన్ రెడ్డి ఆనాడు కేసులు పెడితే అడవుల్లో తల దాచుకోవడం నీకు గుర్తులేదా అన్నారు. ఆరోజు చంద్రబాబు నాయుడు లేకుంటే మనం ఎక్కడ ఉండే వారేమో గుర్తు చేసుకోవాలన్నారు. ఇకపై మా నాయకుడిపై నువ్వు విమర్శలు చేస్తే తగిన రీతిలో బుద్ధి చెబుతామన్నారు. కార్యక్రమంలో కడప పార్లమెంటరీ కార్యవర్గ సభ్యుడు వజ్రా మైసూరారెడ్డి, తాళ్లపల్లి వెంకటేశ్వరరెడ్డి, జ్ఞానేశ్వర్ నాయుడు, మహేశ్వర్‌రెడ్డి, గంగిరెడ్డి పాల్గొన్నారు.

కుండల తయారీకి పుట్టినిళ్లు పెద్దశెట్టిపల్లె

వేసవిలో పేదవాడి ఫ్రిజ్‌కు భలే గిరాకీ.. ఇతర జిల్లాలకూ ఎగుమతి.. కొనసాగుతున్న కులవృత్తి

ప్రజాశక్తి - చాపాడు

పేదవాడి ఫ్రిజ్‌గా పేరు గాంచిన మట్టితో తయారు చేసిన కుండలు, బానలు, ఇతర పాత్రలకు వేసవిలో భలే గిరాకీ ఉంటుంది. వీటికి పుట్టినిళ్లుగా మైదుకూరు మండలం పెద్దశెట్టిపల్లె గ్రామం పేరుగాంచింది. నేటి ఆధునిక కాలంలోకి విద్యుత్, ప్లాస్టిక్ పరికరాల రాకతో మట్టి పాత్రలకు ఆదరణ తగ్గింది. అయినా తమ వంశ పారంపర్యంగా వస్తున్న వత్తిని ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా 40 కుటుంబాల వారు కొనసాగిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నో గ్రామాల్లో కులవృత్తిని వదిలి వివిధ రంగాల్లో స్థిరపడిన పెద్దశెట్టిపల్లె వాసులు సమాజానికి తమ ఉనికిని తెలియజేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇంటిల్లిపాది మట్టి పాత్రల తయారీలో నిమగ్నమవుతూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు ఎగుమతులు చేపడుతూ బతుకు బండిని లాగిస్తున్నారు. వేసవిలో మట్టి కుండలోని నీటికి ఆదరణ ఉండడంతో మరింత ఉత్సాహంగా కుండల తయారీ చేపడుతున్నారు. వేసవి అనగానే చల్లని నీటిని అందించే మట్టి కుండలు గుర్తుకు వస్తాయి. జిల్లాలో కుండల తయారికి కేరాఫ్ పెద్దశెట్టిపల్లె. ఆములో కాల్చి బయటకు తీసిన తాజా కుండలు ఎండలను ఎదుర్కొనేలా సిద్ధం చేస్తు న్నారు. మైదుకూరు-బద్వేలు రోడ్డులో పెద్దశెట్టిపల్లె గ్రామం మైదుకూరుకు ఆరు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. గతంలో జిల్లాలోని పలు ప్రాంతాల్లో మట్టి పాత్రల తయారీ చేసేవారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో తట్టుకోలేక వృత్తిని వదులుకున్నారు. ప్రస్తుతం పెద్దశెట్టిపల్లెలో అధిక కుటుంబాలు ఈ వృత్తిపైనే ఆధార పడి జీవనం సాగిస్తున్నారు. జిల్లాలో బద్వేలు సమీపంలోని పాలెంపల్లె, ప్రొద్దు టూరు వద్ద కల్లూరు, చౌడురు, మైదుకూరు పట్టణంలో ఒకటి రెండు కుటుం బాలు మాత్రమే కుండల తయారీని కొనసాగిస్తున్నారు. ప్రతి రోజూ ఇంటిల్లపాది కష్టపడితే 15కుండల వరకు సిద్ధం చేయవచ్చని వృత్తిదారులు పేర్కొంటున్నారు. 10రోజులపాటు సిద్ధం చేసిన వాటిని ఒకరోజు బట్టిలో ఉంచి కాల్చుతారు. వీటిని విక్రయిస్తారు. ఒక కుండ రూ.100 వరకు ధర పలుకుతుంది. ఆ మేరకు ప్రతి రోజు రూ.5వందల వరకు కూలి ఉంటుందని పేర్కొంటున్నారు.



కులవృత్తిని కొనసాగిస్తున్న పెద్దశెట్టిపల్లె వాసులు

కుండల తయారీ ద్వారానే ఉపాధి..

ఎన్నో ఏళ్లుగా కుండల తయారీ ద్వారానే ఉపాధి పొందుతున్నాం. ఫ్రిజ్‌లు, వివిధ రకాల స్టీల్ పాత్రలు వచ్చిన తర్వాత మట్టి పాత్రల వాడకం తగ్గింది. కొన్ని ప్రాంతాల్లో చాలా మంది వృత్తికి దూరమయ్యారు. తమ గ్రామంలో మాత్రం సాధారణ సమయంలో వ్యవసాయ పనులు చేసుకుంటూ వృత్తిని కొనసాగిస్తున్నాం. వేసవిలో మట్టి కుండలకు మంచి గిరాకీ ఉంటుంది. ఇతర ప్రాంతాల వ్యాపారులు వచ్చి కొనుగోలు చేసి తీసుకెళుతున్నారు.

- శ్రీనివాసులు, పెద్దశెట్టిపల్లె

ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నాం..

తయారు చేసిన పాత్రలు, కుండలు గతంలో గ్రామాలకు వెళ్లి అమ్మకాలు చేపట్టేవాళ్లం. ప్రస్తుతం రాయిచోటి, ప్రొద్దుటూరు, నంద్యాల తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు ఇక్కడికే వచ్చి కొనుగోలు చేసి తీసుకెళుతున్నారు. ఈ నేపథ్యంలో మార్కెటింగ్ సమస్య లేదు.. ఉపాధికీ ఇబ్బంది లేదు. ప్రభుత్వం నుంచి మట్టి సరఫరా, మార్కెటింగ్‌కు సహకారం అందిస్తే ప్రోత్సాహకరంగా ఉంటుంది.

- -జి.సుబ్బరాయుడు, పెద్దశెట్టిపల్లె

ప్రకృతి సౌందర్యానికి నెలవు శేషాచలం కొండలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : జలపాతాలు, లోయలు, కొండలు, వివిధ రకాల వృక్షాలు, జంతువులతో కూడుకున్న శేషాచలం కొండలు ప్రకృతి సౌందర్యానికి నెలవని తిరుపతికి చెందిన ప్రముఖ పాత్రికేయులు ఎ.రాఘవ శర్మ అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న 'నెలనెలా సీమ సాహిత్యం' కార్యక్రమంలో భాగంగా ఆదివారం బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో 142వ సదస్సు నిర్వహించారు 'తిరుమల దృశ్యకావ్యం - పర్యాటక విశేషాలు' అనే అంశంపై ప్రముఖ పాత్రికేయులు, తిరుపతి ఎ.రాఘవ శర్మ ప్రసంగించారు. 30 ఏళ్ల పర్వతారోహణ అనుభవాలను సభకు వివరించారు. అడవి తల్లిలాంటిదని, తరతమభేదాలు లేని జీవవైవిధ్యంతో ఉంటూ మానవ సమాజానికి ఎంతో గొప్ప సందేశాన్ని అందిస్తోందన్నారు. అలసిన మనసులకు ప్రకృతి సేదతీర్చే తల్లి ఒడి అన్నారు. శేషాచలం కొండలు సుమారు 800 చదరపు కిలో మీటర్లు వ్యాపించి ఉన్నాయన్నారు. శేషాచలం కొండల్లోని రామకృష్ణ తీర్థం, తుంబురు తీర్థం, కుమారధార, చక్రతీర్థం, శేషతీర్థం, గుంజన జలపాతం, విష్ణుగుండం, నారాయణ తీర్థం, దశావతార తీర్థం, మార్కండేయ తీర్థం లాంటి అందమైన, ఆహ్లాదకరమైన ప్రదేశాలకు వెళ్ళే మార్గాన్ని తెలుపుతూ అక్కడి విశేషాలను వివరించారు. కార్యక్రమ ప్రారంభంలో వక్త ఎ.రాఘవ శర్మను సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, గ్రంథాలయ సహాయకులు ఎన్.రమేశ్‌రావుమొక్కను బహూకరించారు.



ప్రజలకు సూచనలిస్తున్న డిఎస్‌పి భావన

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : క్రికెట్ బెట్టింగ్, గంజాయి సేవించడం, మట్కా, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డిఎస్‌పి భావన హెచ్చరించారు. ఎస్‌పి ఆదేశాల మేరకు ఆదివారం తెల్లవారుజామున మండల పరిధిలోని అమృత్‌నగర్‌లో డిఎస్‌పి ఆధ్వర్యంలో కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా అమృత్‌నగర్‌లో ఉన్న అనుమానితులు, రౌడీలు, గంజా సేవించే వారు, అమ్మేవాళ్లు, బెల్ట్‌షాపు నిర్వహించే వారి ఇళ్లల్లో సోదా చేశారు. వాహనాల తనిఖీలో నంబర్ ప్లేట్, డాక్యుమెంట్స్ లేని వాహనాలను సుమారు 45 మోటర్ సైకిళ్లను, మూడు ఆటోలు, ఒక ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. వీటిని ఆర్‌టిఐ అధికారులకు తగు చర్య నిమిత్తం పంపినట్లు డిఎస్‌పి భావన తెలిపారు. ఈ సందర్భంగా స్థానికులకు డిఎస్‌పి కార్నర్ సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రూరల్ సిఐ బాలమద్దిలేటి, ఎస్‌ఐలు మహ్మద్ రఫీ, వెంకట పాల్గొన్నారు.

ఎంబార్కేషన్ పాయింట్ రద్దును ఆపడంలో ప్రభుత్వం వైఫల్యం : మునీర్ బాషా

ప్రజాశక్తి - వేంపల్లె

హజ్ యాత్రకు వెళ్లే విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్‌ను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడాన్ని ఆపడంలో కూటమి ప్రభుత్వం పూర్తి వైఫల్యం చెందిందని మాజీ రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ మునీర్ బాషా పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలే కరులతో మాట్లాడుతూ గతంలో హజ్ యాత్ర చేయడానికి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యాత్రికులు హైదరా బాద్, బెంగళూరు నుండి వెళ్లేవారని చెప్పారు. అప్పటి డిప్యూటీ సీఎం అంజా ద్‌బాషా, ఆంధ్రప్రదేశ్ హజ్ కమిటీ చైర్మన్ గౌస్ లాజం ఆంధ్రప్రదేశ్ నుండి వెళ్లే హజ్ యాత్రికుల సౌకర్యార్థం కోసం ఎంబార్కేషన్ పాయింట్ రాష్ట్ర నడిబొడ్డున ఉన్న విజయవాడ కేంద్రంగా ఉండాలని అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కోరారన్నారు. గత సిఎం ఆదేశానుసారం డిప్యూటీ సీఎం, హజ్ కమిటీ చైర్మన్ అప్పటి కేంద్ర ఏవిషియన్ మంత్రి స్మృతి ఇరానీని పలుమార్లు కలిశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయడం వల్ల విజయవాడకు ఎంబార్కేషన్ పాయింట్ ఇచ్చారన్నారు. 2022 వరకు కరోనా ఉన్న కారణంగా హజ్ యాత్ర రద్దు అయిందన్నారు. 2023లో విజయవాడలో హజ్ హౌస్ లేకపోయినా కూడా గుంటూరు వద్ద ఉన్న నంబూరు మదరసాలో సకల ఏర్పాట్లు చేసి, దాదాపు రూ.14 కోట్లు వెచ్చించరన్నారు. హజ్ యాత్రకు వెళ్లే దాదాపు 2,800 మంది హాజీలను ఎలాంటి లోటు లేకుండా విజయవాడ నుండి పంపారన్నారు. హజ్ యాత్రికులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.80 వేల రాయితీ ఇచ్చిందన్నారు. 2024లో కూడా విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుండి పంపారన్నారు. ఎన్నికల కోడ్ వల్ల యాత్రికలకు రావాల్సిన సబ్సిడీ అమౌంట్ ఇవ్వలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి దాదాపు పది మాసాలైనా ఇప్పటివరకు హజ్ యాత్రికులకు సబ్సిడీ డబ్బు ఇవ్వలేదని విమర్శించారు.

ఇకెవైసికి గడువు పెంచాలి

ప్రజాశక్తి - ఖాజీపేట : రేషన్‌కార్డు లబ్ధిదారులు ఇకెవైసి చేయించుకునేందుకు గడువు పెంచాలని పలువురు కోరుతున్నారు. ఇకెవైసి చేయించుకునేందుకు ప్రభుత్వం ఈనెల 31 చివరి గడువుగా విధించింది. పరీక్షలు జరుగుతున్న దృష్ట్యా విద్యార్థులు వివిధ ప్రాంతాల్లో ఉంటున్నారని, ఈ సమయాన్ని ఏప్రిల్ 30 వరకు పెంచాలని రేషన్ కార్డు లబ్ధిదారులు, నాయకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించాలని సూచిస్తున్నారు. ఆ మేరకు ప్రభుత్వాన్ని కోరనున్నట్లు మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ సందుల నాగశివారెడ్డి, కెసి కెనాల్ డిస్ట్రిబ్యూటర్ కమిటీ మాజీ చైర్మన్ ఇట్టేం శ్రీరాముల యాదవ్ పేర్కొన్నారు.

క్రైం కార్నర్

టిప్పర్, బైక్ ఢీ : ఒకరికి గాయాలు

ప్రజాశక్తి-రామాపురం

టిప్పర్ మోటార్ సైకిల్ ఢీకొన్న ఘటనలో మహేష్ అనే వ్యక్తికి తీవ్ర గాయాల పాలైనట్లు పోలీసులు తెలిపారు. మండల పరిధిలోని గువ్వలచెరువు పెట్రోల్ బంకు సమీపంలో ఆదివారం తెల్లవారు జా మున ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు. చక్రాయిపేట మండలం సురభిగ్రామం, ఉప్పరగుంటపల్లికి మహేష్ బైక్‌పై కడప వైపు నుంచి వస్తూ ఉండగా ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొనడంతో మల్లేష్ తీవ్ర గాయాలైనట్లు తెలిపారు. గాయపడిన బాధితుడిని చికిత్స నిమిత్తం రాయచోటి ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తండ్రిపై తనయుల దాడి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



గాయపడిన కృష్ణప్ప

కన్నతండ్రిపై కుమారులు దాడి చేసి గాయపర్చారు. ఈ సంఘటన శనివారం రాత్రి కురబ లకోట మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మట్లివారిపల్లె పంచాయతీ, ఎరమద్ది వారిపల్లికి చెందిన కృష్ణప్ప తన జీవనాధారంగా ఉన్న పాడి ఆవును అమ్మి కొంతనగదును తన పేర బ్యాంకు లో పొదుపు చేసుకున్నాడు. ఆ డబ్బులు తెచ్చివ్వాలని కొడుకులు సురేష్, రాజేంద్ర పట్టుబట్టారు. డబ్బు ఇవ్వడానికి తండ్రి కృష్ణప్ప ఒప్పుకోలేదువిచక్షణ కోల్పోయిన కొడుకులు కనిపెంచిన తండ్రి అని కూడా చూడకుండా కేవలం డబ్బు ఇవ్వలేదన్న కారణంతో కర్రలతో విచక్షణ రహితంగా దాడి చేసి చితకబాదారు. స్థానికులు అడ్డుకుని గాయపడిన బాధితున్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆస్తి కోసం చిత్రహింసలు

-ఆదుకోవాలని బాధితుడి వేడుకోలు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

తన ఆస్తి కోసం తన అత్త, బావమరిది, వారి అనుచరులు చిత్రహింసలకు గురిచేస్తున్నారని రాయచోటి పట్టణానికి చెందిన హిదాయతుల్లా పేర్కొన్నారు. బాధితుడి వివరాల మేరకు..రాయచోటిలోని కొత్తపల్లిలో ఉన్న ఓ ప్రయివేటు స్కూల్ నిర్వహిస్తున్న తనకు మూడేళ్ల క్రితం కలకడలో వివాహం చేసుకున్నట్లు చెప్పారు. వివాహం అనంతరం సంసారం కలకడలో పెట్టాలని తనను బలవంతం చేశారని వివరించారు. తన భార్య తరచూ మందులు వాడేదని, ఆ మందులు మతి స్థిమితం లేని వారు వాడతారని వైద్యులు తెలిపారని అన్నారు. ఈ మందులు వాడే వారికి సంతానం కలగదని చెప్పారని అన్నారు. తన భార్యకు విడాకులు ఇచ్చేస్తానన్న అనుమానంతో తన అత్త, బావమరిది తనను స్కూల్ నుంచి బలవంతంగా కలకడకు తీసుకెళ్లి చిత్రహింసలకు గురి చేసి, మేడపై నుంచి ముళ్ల పొదల్లోకి తోసేయడంతో తీవ్రంగా గాయపడినట్లు తెలిపారు. స్టాంప్ పేపర్లు తెచ్చి తన ఆస్తి రాసివ్వాలని వేధించారని ఆరోపించారు. తన స్కూల్‌లో పనిచేసే ఓ యువతిని ఆమె కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురి చేసి వారు నన్ను కొట్టే విధంగా వీడియో చిత్రికరించి ఆ వీడియో ద్వారా తనకు అక్రమ సంబంధం ఉందని అందుకే వారు కొట్టారంటూ బెదిరించారని అన్నారు. ఆ విషయం చెప్పేందుకు ఆ యువతి కుటుంబ సభ్యులు వెనకడుగు వేస్తున్నారన్నారు. తనకు జరుగుతున్న అన్యాయంపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, పోలీసులు కేసు నమోదు చేసినప్పటికీ వారిపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని వాపోయాడు. పోలీసులు సమగ్రమైన విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకొఇన న్యాయం చేయాలని కోరారు.